
సాక్షి
బాపట్ల

బుధవారం : 18 : జూన్ : 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 513.80 అడుగుల వద్ద ఉంది. ఇది 138.2126 టీఎంసీలకు సమానం.



తెనాలి సుందరీకరణకు చర్యలు

తెనాలి అర్బన్: పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. మంగళవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.



ఎయిర్‌పోర్టులో స్వాగతం

విమానాశ్రయం: జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్‌కు మంగళవారం విమానాశ్రయంలో అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న నిందితులు

బాపట్లటౌన్: పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు..పొలాల్లోని మోటర్లను రెప్పపాటులో దొంగిలించే ఘరానా దొంగలు చివరకు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల పరిసర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు, విద్యుత్ మోటర్లు అపహరించిన కేసులో నిందితులైన ఇద్దరు బాలురను మంగళవారం విజయవాడలోని కోర్టులో బాపట్ల పోలీసులు హాజరుపరిచారు. కోర్టు అనుమతితో వీరిని కోర్టు నుంచి జువైనల్ హోంకు తరలించేందుకు కోర్టు సమీపంలో బస్సు ఎక్కించేందుకు బస్టాండ్‌కు తీసుకెళ్లారు. ఇద్దరు నిందితులకు కాపలాగా ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు ఉన్నారు. పోలీసుల కళ్లుగప్పి చిన్నారులు ఇద్దరు విజయవాడ బస్టాండ్ నుంచి పరారయ్యారు. వీరికోసం ఎంతసేపు గాలించినా ఆచూకీ లభించలేదు. పరారైన ఇద్దరు బాల నేరస్తుల్లో ఒకరు బాపట్ల పట్టణానికి చెందిన వ్యక్తికాగా, మరొకరు కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి చెందిన వ్యక్తి. వీరికోసం అర్ధరాత్రి వరకు పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. చిన్నారులను జైలుకు తరలించే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై పోలీసు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

రెవెన్యూ డేను ఘనంగా నిర్వహిస్తాం



గుంటూరు వెస్ట్: ఈ నెల 20వ తేదీన జరగనున్న రెవెన్యూ డేను ఘనంగా నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి తెలిపారు. 2024లో రెవెన్యూ బోర్డ్ ఏర్పడిన సందర్భాన్ని పురస్కరించుకుని రెవెన్యూ డేను ప్రతి ఏడాది నిర్వహిస్తుంటారని చెప్పారు. రెవెన్యూ శాఖ ప్రజలకు అందించే సేవలను విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తామన్నారు. మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు ఉంటాయని చెప్పారు. రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మంగళవారం డీఆర్వోకు ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు.

నేడు ధ్యాన బుద్ధ వద్ద యోగాంధ్ర

నరసరావుపేట: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అమరావతి ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద బుధవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం వెల్లడించారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి యోగా ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామన్నారు.

అరకు కాఫీ అవుట్‌లెట్ ఏర్పాటుకు ప్రోత్సాహం

నరసరావుపేట రూరల్: నేటివ్ అరకు కాఫీ అవుట్ లెట్ ఏర్పాటు కోసం సెర్ప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి ఇ.వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల పథకంలో భాగంగా నేటివ్ అరకు కాఫీ అవుట్‌లెట్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. అవుట్‌లెట్ స్థాపనకు రూ.10లక్షలు అంచనా కాగా 35శాతం రాయితీ అందజేస్తారని వివరించారు. కాఫీ షాపు నిర్మాణం, ప్రాసెసింగ్ పరికరాలు, పాత్రలు, ఉపకరణాల కొనుగోలుకు మాత్రమే రాయితీ అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు జిల్లా, మండల సెర్ప్ సిబ్బందిని లేదా ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రీసోర్స్ పర్సన్‌లను సంప్రదించాలని సూచించారు.

కడలిని మింగేసిన పచ్చనేత

- ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ సీ మౌత్ కాలువను పూడ్చిన పచ్చనేత
- తద్వారా 10 ఎకరాల తీరం భూమి ఆక్రమణ
- ఎకరం రూ.5 కోట్లు చొప్పున మొత్తం భూమి విలువ రూ.50 కోట్లు
- ముడుపులు పుచ్చుకొని కొంత భూమికి పట్టాలిచ్చిన అధికారులు
- మిగిలిన ఆక్రమణకు డీకేటీలు సిద్ధం
- స్ట్రయిట్ కట్ పూడ్చడంతో కాలువలోనే 2 వేల పడవలు
- నిషేధం ముగిసి రెండు రోజులు దాటినా వేటకు వెళ్లలేని మత్స్యకారులు
- పనులను అడ్డుకున్న 9 గ్రామాల మత్స్యకారులు
- న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామంటున్న మత్స్యకారులు



ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్‌ను కుదించి నేరుగా సముద్రంలో కలిపిన కబ్జాదారులు



కాలువ పూడ్చడంతో ఈపూరు పాలెం స్ట్రయిట్ కట్‌లో నిలిచిన మత్స్యకారుల బోట్లు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: బాపట్ల మండలం దానవాయిపేట వద్ద సముద్రంలో కలుస్తున్న ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్‌ను సీ మౌత్ వద్ద పచ్చనేత, రియల్టర్ బుర్ల వెంకటరావు, (ఈయన టీడీపీ రైతువిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావుకు స్వయాన వియ్యంకుడు) గుంటూరుకు చెందిన మరో రియల్ ఎస్టేట్ కంపెనీ కలిసి ఆక్రమించారు. ఏకంగా సముద్రంలోకి కర్వు(వంపుగా) తిరిగే ఈ ప్రధాన కాలువ మొత్తాన్ని పూడ్చివేశారు. కాలువ తిరిగి అటువైపునకు రాకుండా పెద్ద పెద్ద కొండరాళ్లను తెచ్చి అడ్డుగా కట్టకట్టారు. కిలోమీటరు పొడవున ప్రవహించే కాలువను చిన్నపిల్ల కాలువగా సముద్రంలోకి వెళ్లేలా స్ట్రయిట్‌గా తరలించారు. పాతకాలువను కిలోమీటరు మేర మొత్తం పూడ్చివేసి దాదాపు 10 ఎకరాల విస్తీర్ణం మొత్తాన్ని ఆక్రమించి చదును చేశారు. ఇక్కడ వెంచర్ వేసి అమ్మకం పెట్టడంతోపాటు రిసార్ట్‌లు నిర్మించేందుకు పనులు వేగవంతం చేశారు. రియల్టర్ బుర్ల వెంకటరావు ఆ స్థలంలో ఏకంగా గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం విలువ సగటున రూ.5 కోట్లు ఉంటుంది. ఈ లెక్కన ఆక్రమణ భూమి విలువ రూ.50 కోట్లు ఉంటుందని అంచనా. కబ్జా చేసిన మొత్తం 10 ఎకరాలలో ఇప్పటికే 3.42 ఎకరాలు, 1.50 ఎకరాలు చొప్పున రెండు భాగాలుగా డీకేటీ పట్టాలు కూడా పొందినట్లు సమాచారం. మిగిలిన ఆక్రమణ భూమికి కూడా డీకేటీలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందుకోసం బాపట్ల రెవెన్యూ అధికారులకు రూ. కోట్లలోనే ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులకు సైతం పెద్ద ఎత్తున ముట్టజెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

బోట్లకు తీవ్ర నష్టం

ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్(ప్రధాన కాలువ) సీ మౌత్ సముద్రానికి దాదాపు కిలోమీటరు దూరం నుంచి ఎడమ వైపుకు వంపుగా తిరిగి సముద్రంలో కలుస్తుంది.

దీనివల్ల సముద్రం నుంచి వచ్చే పోటు వల్ల కాలువలో నిలుపుకునే సుమారు 2 వేల బోట్లకు ఎటువంటి ప్రమాదం ఉండదు. అదే స్ట్రయిట్‌గా సముద్రంలోకి కాలువ వెళితే పోటు సమయంలో అలల ఉధృతికి బోట్లు ఒకదానికొకటి కొట్టుకొని పగిలి పోతాయి. దీనివల్ల తీవ్రం నష్టం కలుగుతుందని మత్స్యకారులు వాపోయారు. తమ జీవనభృతినే దెబ్బతీసే ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని కరాఖండిగా చెపుతున్నారు. ఆక్రమణదారులతో అధికారులు చేతులు కలిపి తమకు అన్యాయం చేయడానికి ప్రయత్నిస్తే ఎంతవరకైనా వెళతామని మత్స్యకారులు హెచ్చరించారు.

పనులు అడ్డుకున్న మత్స్యకారులు



తీరంలో పనులు అడ్డుకొని ఆందోళనకు దిగిన మత్స్య కారులు

కబ్జాచేసిన స్థలాన్ని మంగళవారం భారీ యంత్రాలతో చదును చేసే ప్రయత్నం చేయగా విషయం తెలుసుకున్న అడవిపల్లెపాలెం, దానవాయిపేట, కృపానగరం, విజయలక్ష్మీపురం, గాదె వెంకటరెడ్డి కాలనీ, ఓడరేవు తదితర గ్రామాల పరిధిలో 12 వేల కుటుంబాల నుంచి 2 వేల బోట్లకు చెందిన వందలాదిమంది మత్స్యకారులు సీమౌత్ వద్దకు చేరుకుని యంత్రాలతో చేపట్టిన పనులను అడ్డుకున్నారు. గంటల తరబడి మండుటెండలో ఆందోళనకు దిగారు. మత్స్యకారులు బోట్లను ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లో లంగరు వేసి పెట్టుకొని సముద్రంలోకి వెళ్లి వేట సాగిస్తారు. రాకపోకలకు ఈ ప్రధాన కాలువ ఆధారం. రెండు నెలలుగా వేట నిషేధం కావడంతో ఇదే అదనుగా రియల్టర్లు స్ట్రయిట్ కట్‌ను పూర్తిగా ఆక్రమించి పూడ్చి వేశారు. దీంతో రెండు రోజుల క్రితం నిషేధం ఎత్తి వేసినా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కలెక్టర్ ఆదేశాలతో అక్కడికి చేరుకున్న బాపట్ల ఆర్డీవో గ్లోరియా మత్స్యకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా అందుకు వారు ససేమిరా అన్నారు. దీంతో రెండు రోజుల్లో సమావేశం పెట్టి అందరితో మాట్లాడి పరిష్కారం చూపుతామని సర్ది చెప్పి అధికారులు పనులు నిలిపి వేయించారు.

రియల్టర్‌తో ఎమ్మెల్యే మంతనాలు



మత్స్య కారుల ఆందోళనను పట్టించుకోక రియల్టర్‌తో బాపట్ల ఎమ్మెల్యే వర్మ మంతనాలు

ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ ఆక్రమణ గొడవ విషయం తెలుసుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ హుటాహుటిన వెళ్లి రియల్టర్ వెంకటరావును కలిసి ఆయన అతిథి గృహంలో మంతనాలు సాగించారు. ఎమ్మెల్యే తీరుపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

బుర్ల వెంకట్రావుపై చర్యలు తీసుకోవాలి

బాపట్లటౌన్: సముద్రపు అంచున బండరాళ్లతో అడ్డుకట్ట వేస్తున్న బుర్ల వెంకట్రావుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన మంతెన కరుణరాజు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుడి కథనం మేరకు.. బాపట్ల మండలం పాండురంగాపురం పంచాయతీ పరిధిలోని అడవిపల్లిపాలెం సమీపంలో తనకు 13 ఎకరాల నాన్ అగ్రికల్చరల్ భూమి ఉందని, నా భూమికి పడమర వైపున చీరాల మండలం పిట్టువారిపాలెం గ్రామానికి చెందిన బుర్ల వెంకట్రావుకు పొలం ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా వెంకట్రావు పెద్దపెద్ద కొండరాళ్లతో సముద్రపు నీరు బయటకు రాకుండా అడ్డుకట్ట వేస్తున్నారని, ఇదేమని అడిగినందుకు చంపుతానని బెదిరిస్తున్నారని అన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఆంక్షల చట్రం

నేడు రెంటపాళ్లలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన



జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

- పోలీసులు అడిగిన సమాచారం ఇచ్చాం
- వైఎస్సార్ సీపీ నేతలు విడుదల రజిని, కాసు మహేష్ రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గజ్జెల సుధీర్ రెడ్డి

నరసరావుపేటరూరల్: వైఎస్ జగన్ పర్యటనలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి భయంతో కూటమి సర్కారు వణికిపోతోందని మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిలు మండిపడ్డారు. పోలీసులు, కూటమి నేతల వేధింపులు తాళలేక గత ఏడాది జూన్ 6న ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పల్నాడు జిల్లా రెంటపాళ్ల గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో పర్యటనకు సంబంధించి పోలీస్ భద్రత కల్పించాలని నాయకులు మంగళవారం జిల్లా ఎస్పీని కలిశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం బయట మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలను అడ్డుకోవాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం అనుమతుల పేరుతో పోలీసుల ద్వారా ఆంక్షలు విధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి, బాధతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెడుతుండటాన్ని కూడా రాజకీయ కోణంలో చూడటం దారుణమన్నారు.

ఆంక్షలతో జనం ఆకాంక్షలు అడ్డుకోలేరు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటన తర్వాత కూటమి ప్రభుత్వంలో ఆందోళన మొదలైందని నేతలు పేర్కొన్నారు. ఆయన ప్రజా సమస్యల పరిష్కారం కోసం బయటకొస్తే ప్రభుత్వం రోజులు లెక్క పెట్టుకోవాల్సి వస్తుందనే భయం కనిపిస్తోందన్నారు. ఆ భయంతోనే పోలీసులు చిత్రవిచిత్రమైన ఆంక్షలు విధించి అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. కేవలం 100 మందికే అనుమతిస్తామని పోలీసులు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపించి ఆయన పర్యటన అడ్డుకోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. అయినప్పటికీ చట్టాన్ని గౌరవించే పార్టీగా ఇప్పటికే మూడుసార్లు అనుమతుల కోసం పోలీసులను కలవడం జరిగిందని, మళ్లీ ఈరోజు మరోసారి జిల్లా ఎస్పీని కలవడం జరిగిందన్నారు.

కొనుగోళ్లు ఉన్నట్టా.. లేనట్టా!

అయోమయంలో బర్లీ పొగాకు రైతులు

- పర్చూరు పొగాకు కొనుగోలు కేంద్రంలో ప్రారంభం కాని కొనుగోళ్లు
- నేటికీ ప్రారంభించని ప్రభుత్వ అధికారులు
- కంటి తుడుపు చర్యలతో సరిపెడుతున్న కూటమి ప్రభుత్వం



పర్చూరు మార్కెట్ యార్డును సందర్శించిన మార్క్‌ఫెడ్ ఎండీ

పర్చూరు(చినగంజాం): బర్లీ పొగాకు కొనుగోలు విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రైతుల పరిస్థితి అయోమయంగా తయారైంది. జిల్లాలో రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం మళ్లీ వెనకడుగు వేస్తోంది. పర్చూరులో ఈ నెలలో అధికారిక కొనుగోళ్లు ప్రారంభిస్తామన్న కూటమి ప్రభుత్వం వాగ్దానం ఇంకా నెరవేరలేదు. బర్లీ పొగాకు రైతులను మభ్యపెట్టేందుకు జూన్ 7వ తేదీన మంచి రోజు అంటూ హడావుడిగా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీతో కొబ్బరికాయ కొట్టించి పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మరో 15 రోజుల్లో కొనుగోలు కేంద్రం ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు జరుపుతామన్నారు. అటు తరువాత స్థానిక శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడును కలిసి ఈనెల 17వ తేదీ పర్చూరు మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రం ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభిస్తామని అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. కానీ మంగళవారం పర్చూరులో కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు.

పగబట్టిన పొగాకు

నాలుగేళ్లుగా లాభాలు రావడంతో ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు పొగాకు సాగు చేపట్టారు. దీంతో కౌలు, కూలీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. అయినప్పటికీ రైతులకు ఆశ చావక పొగాకు పంటను విస్తృతంగా చేపట్టారు. ఈ క్రమంలో గిట్టుబాటు ధర మృగ్యమైంది. దీంతో వైఎస్సార్ సీపీ, రైతు సంఘం నాయకులు పొగాకు రైతుల తరఫున ఆందోళన బాట పట్టారు. ధర్నాలు, రాస్తా రోకో నిర్వహించారు. మే 24న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో కూడిన బృందం పర్చూరు ప్రాంతంలో పర్యటించి రాష్ట్రంలోని 22 ప్రయివేట్ కంపెనీలు బర్లీ పొగాకును తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఆ కంపెనీలు 25 మెట్రిక్ టన్నులకు మించి కొనుగోలు చేయలేకపోయాయి. వ్యవసాయ శాఖ అందించిన లెక్కల ప్రకారం గత వారం నాటికి రైతుల వద్ద ఉన్న మొత్తం 87 మెట్రిక్ టన్నులకుగాను కేవలం 25 మెట్రిక్ టన్నులు కంపెనీలు కొనుగోలు చేశాయి. రైతు సంఘాలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది.

ఏడు మార్కెట్ యార్డుల ద్వారా..

రాష్ట్రంలో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్షేత్రస్థాయిలో పంట నిల్వలకు గోడౌనులు, మార్కెటింగ్ మార్క్‌ఫెడ్ అధికారులు పరిశీలించారు. కంపెనీలు కొనగా మిగిలిన ఉత్పత్తి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, మద్దిపాడు యార్డుల ద్వారా సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీన పర్చూరు మార్కెట్ యార్డును మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జిలానీ సామూన్ సందర్శించి రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు నిల్వలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అయినా ఎటువంటి కదలిక రాలేదు.

ఉన్నతాధికారుల ఆదేశాల అనంతరం కొనుగోళ్లు ప్రారంభిస్తాం

గ్రేడింగ్ విషయంలో రైతులు ముందుకు రాకపోవడంతో కొనుగోళ్లు ప్రారంభించలేదు. రైతుకు మంచి ధర రావాలంటే గ్రేడింగ్ తప్పనిసరిగా చేయాల్సి ఉంది. పండిన పొగాకును మూడు గ్రేడులుగా విభజించాల్సిందిగా రైతులు సూచించి వారికి శిక్షణ ఇవ్వడం కూడా ఇచ్చాం. కానీ గ్రేడులు చేసేందుకు, ఆ విధంగా పంటను అమ్మేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి స్పష్టమైన ఆదేశాలు వచ్చాక కొనుగోళ్లు మొదలు పెడతాం.

– కరుణశ్రీ,, డీఎం, మార్క్‌ఫెడ్

కలెక్టర్ గారూ అంతా ఓకే అట!

- ప్రజా వేదికలో కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- సమస్య పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- శృతి మించుతున్న మండలస్థాయి అధికారుల ప్రవర్తన
- జిల్లా మేజిస్ట్రేట్ మాటలకే పంగనామాలు

జె.పంగులూరు: జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ ఆదేశాలకే విలువ లేకుండా పోతోంది. పని చేయకుండానే చేసినట్లు ఏకంగా ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేస్తున్న మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' అంతా డొల్లేనని తేటతెల్లం చేస్తున్నారు. మండల పరిధిలో వివిధ కారణాలు వల్ల పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళతారు. కలెక్టర్ పరిష్కరిస్తారనే నమ్మకంతో అర్జీ ఇచ్చి వారి సమస్యలను విన్నవించుకుంటారు. ఆ సమస్యను పరిష్కరించమని తిరిగి మండలాలకు కలెక్టర్ కార్యాలయం నుంచి వస్తాయి. కానీ మండల అధికారులు అర్జీదారునితో మాట్లాడకుండానే సమస్య పరిష్కరించినట్లు కలెక్టర్‌కు రిపోర్టులు పంపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. పంగులూరు గ్రామానికి చెందిన పాలపర్తి ఏలియా రెండు నెలల క్రితం కలెక్టర్‌కు నివేశన స్థలానికి సంబంధించి కలెక్టర్‌కు అర్జీ పెట్టాడు. ఆ అర్జీ జె.పంగులూరు మండల తహసీల్దార్‌కు వచ్చింది. కానీ ఇక్కడ తహసీల్దార్ అర్జీదారునితో మాట్లాడకుండానే సమస్య పరిష్కారమైనట్లు నివేదికను పై అధికారులను పంపించారు. అర్జీదారునికి తెలియకుండా అతని ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈవిషయమై అర్జీదారునికి సమస్య పరిష్కారం అయిందని మెసేజ్‌తోపాటు ఫోన్ చేశారు. దీంతో అర్జీదారుడు తనను సంప్రదించకుండా నా అర్జీని ఎలా పరిష్కరిస్తారని తహసీల్దార్‌ని అడగగా వారి వద్ద నుంచి సరైన సమాధానం లేదు. జె.పంగులూరు మండ లం నుంచి బాపట్ల వెళ్లాలంటే సుమారు 60 కిలోమీటర్లు. వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందించినా ఉపయోగం లేకుండా పోతోంది.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక


PALAPARTHI YELIA గారు, (Grievance No#) BPT202504215763 తో నమోదు చేసిన మీ అర్జీని పరిష్కరించాము. మరిన్ని వివరాలను దయచేసి https://pgrs.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చు

ధన్యవాదములు - ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం

అర్జీదారుకు వచ్చిన మెసేజ్

ఎగవేతదారుల నుంచి పన్నులు వసూలు చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: వాణిజ్య పన్నుల ఎగవేతదారుల నుంచి పన్ను వసూలుకు అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వాణిజ్య పన్నులు, అనుబంధశాఖల అధికారులతో జిల్లాస్థాయి సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. చట్టబద్ధంగా వాణిజ్య పన్ను వసూలుపై యంత్రాంగం దృష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.95.14 కోట్లు వాణిజ్య పన్ను వసూలు జరిగిందన్నారు. ప్రస్తుతం గణనీయంగా పన్ను వసూలు తగ్గడంపై ఆరా తీశారు. గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు, రవాణాలో బోగస్ రిజిస్ట్రేషన్ల ద్వారా పన్నులు వసూలు కావడం లేదని తాజా సర్వేలో వెలుగులోకి వచ్చిందన్నారు. పన్నుల ఎగవేతను అరికట్టడానికి ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. తీర ప్రాంతాల్లోని రిసార్ట్స్ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలపై పర్యాటకశాఖ, వాణిజ్య పనుల శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. జీఎస్టీ చెల్లించకుండా గుత్తేదారులు పనిచేస్తున్నట్లు నిర్ధారణ అయితే వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ బి గీతా మాధురి, డీఆర్వో జి గంగాధర్ గౌడ్, జిల్లా వాణిజ్య పనుల శాఖ అధికారిని ఆర్ శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీఎంఎఫ్ఎంఈ పథకంతో ఉపయోగం

వేటపాలెం: పీఎం సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి (పీఎంఎఫ్ఈ) పథకాన్ని అందిపుచ్చుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. వేటపాలెం మండలం కొత్తపేటలోని సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి లబ్ధిదారుల యూనిట్లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ప్రసాద్ నగర్‌లోని సాయి తేజ వేరుశనగ శుద్ధి యూనిట్‌ను పరిశీలించారు. లాభనష్టాలను, వ్యాపారసరళి, ముడి సరుకు కొనుగోలు వివరాల ను యజమానిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి కొత్తపేట బాల ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. విద్యుత్ సమస్యల వలన ఉత్పత్తి జరగటం లేదని తెలిపారు. సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఖలీం, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ గోపికృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

వేమూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాకు చెందిన దిగువ పేర్కొన్న నాయకులకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగం కమిటీలలో వివిధ హోదాలలో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళ వారం ఓ ప్రకటన విడుదల చేసింది. వేమూరు నియోజకవర్గం నుంచి రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ గాదె శివరామకృష్ణారెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా విష్ణుమొలకల వెంకటరెడ్డియ్య, రాష్ట్ర కల్చరల్ వింగ్ జనరల్ సెక్రటరీగా చలంచర్ల సుధారాణి, రేపల్లె నియోజకవర్గం నుంచి రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ సజ్జా పద్మావతి, అద్దంకి నియోజకవర్గం నుంచి రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ జనరల్ సెక్రటరీ కంచల శ్రీదేవిని నియమించారు.

బైక్‌పై విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు



కృష్ణలంక(విజయవాడ తూర్పు): కృష్ణలంక జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంతో ఓ యువకుడు ప్రమాదకర విన్యాసాలు చేసి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేసిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా పెనుమాక గ్రామానికి చెందిన మోహన్‌ప్రసాద్, ఉయ్యాల సురేష్ స్నేహితులు. మోహన్‌ప్రసాద్ కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతని బైక్‌ను కొన్ని రోజుల క్రితం సురేష్ తీసుకెళ్లి వెనుక మరో యువకుడిని ఎక్కించుకుని అర్ధరాత్రి కృష్ణలంక జాతీయ రహదారిపై విన్యాసాలు చేశాడు. వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశాడు. వాటిని ఎవరో ప్రయాణికులు వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. ఆ విన్యాసాలను ఇన్‌స్టాగామ్‌లో ఈ నెల 15న మోహన్‌ప్రసాద్ చూశాడు. తన బైక్‌తోనే విన్యాసాలు చేశాడని గుర్తించాడు. గంటలో తీసుకొస్తానని చెప్పి తన బైక్‌ను తీసుకెళ్లి అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడిపాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని మోహన్‌ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక పాలన



కూటమి ప్రభుత్వ మోసాలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్, నాయకులు

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్
- 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ

చెరుకుపల్లి: రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతుందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మంగళవారం గుళ్లపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' అనే పేరుతో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యాలపై రూపొందించిన పుస్తకాన్ని డాక్టర్ గణేష్ నియోజకవర్గ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని, ఆ తర్వాత హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుండడంతో పథకాలను అరకొరగా అమలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలకు, రైతులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని డాక్టర్ గణేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, దౌర్జన్యాలు, చేస్తూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో వేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, కాటూరి శివ, బొర్రా శ్రీనివాసరావు, మండల కన్వీనర్లు దుండి వెంకటరామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ రాంబాబు, నాయకులు చదలవాడ శ్రీనివాసరావు, నిజాంపట్నం కోటేశ్వరరావు, లుక్కా బాపనయ్య, ఉల్లంగుంట శ్రీరామ్మూర్తి, వంగర భాను, ప్రభు కిరణ్, ఖుద్దూస్, చౌటూరి రమేష్, డి.కొండలురెడ్డి, శొంఠి సురేష్, రాజ్‌పాల్, కందుల సురేష్, పిట్టు సాంబశివారెడ్డి, గాలిమోటు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాల అమలులో ప్రభుత్వం విఫలం



చెరుకుపల్లి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో పుస్తకావిష్కరణ చేసిన వరికూటి అశోక్‌బాబు

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు
- 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ

వేమూరు: గత ఎన్నికల్లో కూటమి సూపర్ సిక్స్ పథకాలు వాగ్దానాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. 'జగన్ అంటే నమ్మకం -చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని చెరుకుపల్లి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి చేయకపోగా వారు చేసిన మోసాలను, అరాచకాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కూటమి ఏడాది పాలనంతా విధ్వంసమేనని అశోక్‌బాబు మండిపడ్డారు. ప్రజలకు చేసిన వాగ్దానాలు ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రజల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు, ఆధారాలతో ఈ పుస్తకం రూపొందించడం జరిగిందన్నారు. మోసపు హామీలు, అబద్ధపు మాటలతో మభ్య పెట్టి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొట్టిపాటి హిమచంద్ర శ్రీనివాస్, సుజ్జల నాగ మల్లేశ్వరరావు, పడమటి శ్రీనివాసరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు ఇమామ్ హుస్సేన్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి సిరాజ్, దున్నా మేరీసుబాబు, గుమ్మడి దానియేలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

చీరాల అర్బన్: రాష్ట్రంలో కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రామకృష్ణాపురంలోని పార్టీ కార్యాలయంలో కూటమి పాలన గురించి ప్రచురించిన 'వెన్నుపోటు' పుస్తకాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. పాలనపై, ఇచ్చిన హామీలపై ఎవరు మాట్లాడినా కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి అరాచకాలు, మహిళలు, యువతులు, చిన్నారులపై అకృత్యాలు పెరిగాయన్నారు. కూటమి వైఫల్యాలపై ప్రశ్నిస్తే కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. హామీలను నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత పాలనకు ప్రజలు తేడా గమనిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు హామీలు గుప్పించి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయినా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సుపరిపాలన అందిస్తున్నామంటూ ప్రగల్భాలు చెప్పుకోవడం దారుణమన్నారు. పార్టీ నాయకులు కావూరి రమణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసిమళ్ల వాసు, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బత్తుల అనిల్, మచ్చా సువార్త, వేటపాలెం మండల అధ్యక్షులు సాధు రాఘవ, వేటపాలెం మైనార్టీ అధ్యక్షులు ఖాదర్, డి.మార్క్, తేళ్ల రాంబాబు, రామచంద్ర, జాన్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీటింగ్ కేసు నమోదు

అద్దంకి: పట్టాదారు పాస్‌పుస్తం ఇప్పిస్తాని నమ్మించి డబ్బు తీసుకుని మోసం చేసిన విషయమై బాధితుని ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు మగళవారం తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం అద్దంకి గ్రామం కట్టకిందపాలెం చెందిన అరిగెల అరుణ్‌బాబు, తాతయ్య అరిగెల గాలియ్యకు ఉత్తర అద్దంకి సర్వే నంబరు 19లో 0.90 సెంట్ల భూమి ఉంది. కాగా ఆ భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం పోగొట్టుకున్నాడు. ఆ పట్టాదారు పాస్‌పుస్తకం తాను ఇప్పిస్తానని ప్రకాశం జిల్లా చెరువుకొమ్ముపాలెం నివాసి ధనరాజుపల్లి ఆంజనేయులు, వెల్లంపల్లి గ్రామ నివాసి పులిపాటి రాఘవులు అనేవారు ఫిర్యాదుదారు వద్ద విడతల వారీగా రూ.8 లక్షలు తీసుకున్నారు. అయితే వారు ఎంతకాలానికీ ఆ సర్వే నంబర్‌లో ఉన్న 0.90 సెంట్ల భూమికి పాస్‌బుక్ ఆన్‌లైన్ చేయకపోడంతో ఫిర్యాది అరుణ్‌బాబు అద్దంకి పోలీసుస్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేశాడు.

జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు స్థాన చలనం

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను వివిధ స్టేషన్‌లకు తాత్కాలికంగా ఎటాచ్ చేస్తూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీసీబీలో పనిచేస్తున్న టి.తిరుపతి రావును మాచవరం పీఎస్‌కు, మాచవరం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎం.రోశయ్యను సీసీఎస్‌కు, నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో పనిచేసే డి.అశోక్‌ను నాగార్జునసాగర్ పోలీసుస్టేషన్‌కు గురజాల పోలీసుస్టేషన్‌లో పనిచేసే వై.వినోద్‌కుమార్‌ను మాచర్ల రూరల్ పోలీసుస్టేషన్‌కు ఎటాచ్ చేశారు.

కౌన్సిలర్ హుకుం... కమిషనర్ జీ హుజూర్

- ప్రైవేటు అపార్టుమెంట్ వ్యవహారంలో కమిషనర్ అత్యుత్సాహం
- వ్యాపారస్తులపై కమిషనర్ హడావిడి

చీరాల: పట్టణంలోని పాలిమేర రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో కింద ఫ్లోర్‌లో వస్త్ర, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కింద షాపులు, పైన నివాస సముదాయాలున్నాయి. అయితే ఇదంతా మామూలుగా ఉంది కదా అనుకుంటే పొరపాటే. మంగళవారం అందరినీ ఆశ్చర్యపరిచే సంఘటన చోటుచేసుకుంది. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ వ్యాపారస్తుల వద్దకు వచ్చి షాపుల ముందు పెట్టిన బట్టల బేళ్లు తొలగించాలంటూ హుకుం జారీ చేశారు. సాయంత్రానికి తొలగించకుంటే బయటకు లాగేస్తాం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అసలు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

జరిగింది ఇదీ..

చీరాల పట్టణంలోని 12వ వార్డులో పాలిమేర రోడ్డులోని ఓ అపార్టుమెంట్ కింద భాగంలో పలువురు ఎప్పటి నుంచో వస్త్రవ్యాపారాలు నిర్వహిస్తున్నారు. షాపుల బయట బట్టల బేళ్లు పెట్టుకుంటున్నారు. అయితే అదే అపార్టుమెంట్‌లో నివసిస్తున్న అధికార పార్టీ మహిళా కౌన్సిలర్‌కు మాత్రం ఇది నచ్చలేదు. బట్టల బేళ్లు బయట అడ్డంగా పెట్టవద్దంటూ వ్యాపారస్తులకు సూచించారు. సీజన్ కావడంతో బయట పెట్టుకుంటేనే వ్యాపారం జరుగుతుందని, వ్యాపారాలు సరిగా లేవు, కష్టమర్లు వెళ్లిన తర్వాత లోపల పెట్టుకుంటామని చెప్పారు. అంతే ఆమెకు కోపం వచ్చి వ్యవహారం ఇంకోలా మారింది. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌ను అక్కడకు పిలిపించారు. ఏదో తప్పు చేసినట్లుగా ఆయన అక్కడకు వచ్చి వ్యాపారస్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంప్లెక్సులో షాపుల ముందు పెట్టిన బేళ్లు, బట్టలు సాయంత్రానికి తొలగించకుంటే మా మున్సిపాలిటీ వారు వచ్చి రోడ్డు మీద పడవేస్తారు" అంటూ బెదిరింపు ధోరణితో చెప్పి వెళ్లారు. దీంతో వ్యాపారస్తులందరూ ఒక్కసారిగా విస్తుపోయారు. ఇదేమీ మున్సిపల్ కాంప్లెక్సు కాదని, ప్రైవేటు కాంప్లెక్సులోని వస్త్ర వ్యాపారస్తులపై కమిషనర్ వచ్చి బెదిరింపు ధోరణిగా మాట్లాడడం ఏమిటని వ్యాపారస్తులు వాపోతున్నారు. తోటి వ్యాపారస్తులకు ఏ ఇబ్బందులు లేనప్పుడు ఓ అధికార పార్టీ మహిళా కౌన్సిలర్ మున్సిపల్ కమిషనర్‌ను పిలవడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారు. కాగా దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేశారా అని అడుగగా సమాధానం కరవవడం గమనార్హం.



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


తెనాలి రూరల్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోకి కొలకలూరు గ్రామానికి చెందిన గమిడి రామారావు(58) అనారోగ్య కారణాలతో సోమవారం అర్ధరాత్రి దాటాక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం మంగళవారం వెలుగు చూడడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

అందుబాటులోకి రానున్న ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి-నరసాపూర్, చర్లపల్లి-జల్‌నా, తిరుపతి-జల్‌నా వయా గుంటూరు డివిజన్ వారాంతపు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి రానున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇవీ...

- నంబర్ 07233 చర్లపల్లి- నరసాపూర్ రైలు ప్రతి శనివారం రాత్రి 07.50 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది. జూలై 5వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 28వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది.
- నంబర్ 07234 నరసాపూర్ - చర్లపల్లి రైలు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నరసాపూర్ నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది జూలై 6వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేదీ వరకు ఇది అందుబాటులో ఉంటుంది. ఈ రైలు నల్గొండ, మిరియాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగించనుంది.
- నంబరు 7609 జల్‌నా-తిరుపతి రైలు ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు జల్‌నా నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు తిరుపతి చేరుకుంటుంది జూలై 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు అందుబాటులో ఉంది.
- నంబర్ 07610 తిరుపతి-జల్‌నా రైలు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు తిరుపతి నుంచి బయలు దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.50 గంటలకు జల్‌నా చేరుకుంటుంది. జూలై 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. ఈ రైలు తెలుగు రాష్ట్రాల్లోని మారపల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిరియాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగించనుంది.

క్వారీ గుంతలో పడి యువకుడు మృతి



నాగరాజు (ఫైల్)

గుంటూరు రూరల్: క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు జిల్లా పేరేచర్ల గ్రామానికి చెందిన కట్టెపోగు నాగరాజు (30) ఆటోడ్రైవర్. అతనికి భార్య రూపకోటేశ్వరి, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మరో రెండు రోజుల్లో కోటేశ్వరి ప్రసవించనుందని వైద్యులు తెలిపారు. దీంతో నాగరాజు ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం బయటకు వెళుతున్నానని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవటంతో స్థానికులు అంతటా వెతికారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెల్లక్వారీ గుంత వద్ద నాగరాజు చెప్పులు, పక్కనే అతని ద్విచక్ర వాహనం కనిపించాయి. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తొలుత మేడికొండూరు, నల్లపాడు పోలీసుల మధ్య సరిహద్దు వివాదం నడిచిన అనంతరం నల్లపాడు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, గజ ఈతగాళ్ల కోసం సోమవారం వేచి చూశారు. రాత్రి కావటంతో మంగళవారం ఉదయం నుంచి వెతుకులాట ప్రారంభించగా, నాగరాజు మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నాగరాజు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారి పడ్డాడా? ఇక్కడ ఎక్కువగా ఉన్న కోతులు దాడి చేస్తే తప్పించుకునే క్రమంలో ప్రాణాలు కోల్పోయాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మృత్యుపాశాలుగా క్వారీ గుంతలు

అనుమతులు లేకున్నా అక్రమంగా మైనింగ్ క్వారీలను నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యవహరిస్తున్నారు. ఎక్కువ లోతులో క్వారీలను తవ్వి వదిలేస్తున్నారు. ఈ గుంతల్లో నీరు నిలిచిపోతోంది. విషయం తెలియని కొందరు వ్యక్తులు ఇటువంటి ప్రమాదాలతో ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధర ఢమాల్... రైతు డీలా..

- 1011 ఎకరాల్లో పండ్ల తోటల సాగు
- కొనే నాథుడు లేక తోటల్లోనే పండి రాలిపోతున్న కాయలు
- ఎకరాకు రూ.1.6 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులు
- ప్రభుత్వ ప్రోత్సాహం నిల్
- మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని రైతుల వేడుకోలు
- రైతులను నట్టేట ముంచిన అకాల వర్షాలు



సాగులో ఉన్న బొప్పాయి



బల్లికురవ: వాణిజ్య, వ్యాపార పంటలు సాగు చేసి విసిగి వేసారిన రైతులు దశాబ్దం నుంచి పండ్ల తోటల సాగు వైపు మళ్లారు. సాగులో ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ఏడాది ధర దిగజారటంతో తోటల వద్దకు కొనే వారు కరువయ్యారు. దీంతో కాయలు పండి రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1011 ఎకరాల్లో సాగు

బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లో 1011 ఎకరాల్లో అరటి, మామిడి, బొప్పాయి సాగు చేపట్టారు. ఖరీఫ్ ఆరంభంలో సారవంతమైన నీటి వసతి కలిగిన భూముల ఎంపికతో బల్లికురవ మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు, కూకట్లపల్లి, వల్లాపల్లి, కొత్తూరు, రామాంజనేయపురం, వెలమవారిపాలెం, కొప్పెర పాలెం, సంతమాగులూరు మండలంలోని చవిటిపాలెం, ఏల్చూరు, కుందుర్రు, కొప్పరం, మక్కెనవారిపాలెం, పాతమాగులూరు, మార్టూరు మండలంలోని జంగమహేశ్వరపురం, బొల్లాపల్లి, ఇసుకదర్శి, నాగరాజుపల్లి, తండాలో పండ్ల తోటల సాగు చేపట్టారు. ఫిబ్రవరి, ఏప్రిల్ వరకు ధరలు కొంత మేర ఆశాజనకంగానే ఉన్నాయి. బొప్పాయి కిలో రూ.15 నుంచి రూ.18 పలకగా మామిడి కిలో రూ.60 నుంచి రూ.70 వరకు పలికింది.

అకాల వర్షాలతో దిగజారిన ధరలు

మే నెలలో కురిసిన అకాల వర్షాలకు తోడు ఎగుమతులు లేనందున గత నెల నుంచి బొప్పాయి కిలో రూ.3లకు, మామిడి కిలో రూ.30లకు పడిపోయింది. తీరా దిగుబడులతో ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికందే దశలో మార్కెట్ దిగజారటం, ఎగుమతులు లేనందున రైతులు చేసేది లేక తోటల వద్ద వచ్చిన కాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దిగజారిన ధరలతో పంటల సాగుకు తెచ్చిన పెట్టుబడులు ఎలా తీర్చాలో అంతుచిక్కటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ పరంగా మార్కెటింగ్ చేసి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



కొత్తూరులో అకాల వర్షాలకు చెట్లు విరిగి నేలకు వాలిన బొప్పాయి

ప్రోత్సాహం అందటంలేదు



జంగమహేశ్వరపురం, అగ్రహారంలో ఏడెకరాల్లో మామిడిలో అంతర్ పంటగా బొప్పాయి సాగుకు రూ.15 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాను. అగ్రహారం భూములు కావటంతో పంటల సాగులో ప్రభుత్వ ప్రోత్సాహం అందలేదు. పంట దిగుబడులు రాగానే అకాల వర్షాలతో మార్కెట్ పూర్తిగా దిగజారింది. పొలంలోనే కాయలు పండి రాలిపోతున్నాయి.

– చింతల శ్రీనివాసరావు, రైతు, కేవీ పాలెం

అకాల వర్షాలు నట్టేట ముంచాయి



ఆరు ఎకరాల్లో అరటి, బొప్పాయి, పుచ్చసాగు చేశా. రూ.10 లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టాను. ఏప్రిల్ చివరిలో, మే నెలలో కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు బొప్పాయి చెట్లు నేలకు వాలి తీవ్ర నష్టాలను మిగిల్చాయి. పుచ్చ ధరలేక తోటల్లోనే పండిపోయాయి. పంట సాగుకు తెచ్చిన పెట్టుబడులు ఎలా తీర్చాలో అంతు చిక్కటం లేదు.

– తాటిపర్తి భాస్కరరెడ్డి, కూకట్లపల్లి